# రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

డా॥ జి. అరుణ కుమారి

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి (23-01-1893 - 11-03-1979) పేరు వినగానే విద్యార్థులకు జ్ఞాపకానికి వచ్చేది నిగమశర్మ అక్క, తిక్కన తీర్చిన సీతమ్మ, రాయలనాటి రసికత. రాళ్ళపల్లి గ్రంథ పరిష్కర్తగా, వ్యాస రచయితగా, విమర్శకునిగా, గాన కళాప్రపూర్ణగా సాహిత్యలోకానికి సుపరిచితులు.

ఖండ కావ్య ప్రక్రియ ఉదయిస్తున్న కాలంలో రాళ్ళపల్లి, తారాదేవి (1911) అనే వీర శృంగారరస ప్రధానమైన ఖండకావ్యాన్ని, మీరాబాయి (1912) అనే విషాదాంత ఖండకావ్యాన్ని రచించి ఈ ప్రక్రియకు మార్గదర్శకులయ్యారు. తార అనే పడుచుపిల్ల ధైర్య సాహసాలను తెలియజేసే కథ తారాదేవీ. కథాకథనంపై దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించారు. మీరాబాయి రచనలో స్త్రీలలో ఉండే ముందుచూపు పురుషులకు మృగ్యమన్నారు. మీరాబాయిలో మధురభక్తి స్వరూపం కనిపించదు. పతిప్రేమ, దైవభక్తి రెండూ ముద్దకట్టిన రూపం.

క్రీ.శ. 1910లో కట్టమంచి రామలింగారెడ్డి గారి పరిచయంతో పాశ్చాత్య భారతీయ సాహిత్య సిద్ధాంతాలను ఆధునిక దృక్పథంతో సమన్వయ మార్గంలో పరిశీలించారు. భార్గవిపంచవింశతి అనే శుక్రవార పద్యాలను రచించినారు. శమీపూజ, పెనుగొండపాట వంటి పౌరాణిక గాథ స్థలచరిత్రలు రచించారు. కవితా రచనను విరమించుకోవడం తెలుగు కావ్య ప్రపంచానికి తీరనిలోటు.

రాళ్ళపల్లి అనువాదం

ప్రాకృత సంస్కృత గ్రంథాలను ఆంధ్రీకరించి తెలుగు సాహిత్యానికి విలువైన సంపదను సమకూర్చారు. హాలుడు ప్రాకృతంలో రచించిన గాథాసప్తశతిని 'శాలివాహన

గాథాసప్తశతీసారము' గా 1931లో ప్రచురించారు. 738 గాథలు చమత్కార శ్లేషయుక్తంగా కొనసాగాయి. అనువాదం యథామూలమైనా చక్కని తెలుగు పలుకుబళ్ళు ప్రయోగించబడ్డాయి. ఈ గ్రంథంలో పల్లె జీవనం పేదవారి నిర్మలప్రేమ నర్మగర్భితమైన పలుకులు హాస్యం వ్యక్తమవుతావు. అంధకారాన్ని పోగొట్టే వెలుగుదివ్వెల వంటి ఈ పద్యాలు భర్తృహరి, వేమనవంటి వారికి మార్గదర్శకాలయ్యాయి. ప్రాకృత గాథా సప్తశతి సారం కాళిదాసు రచనలలోనూ కనిపిస్తుంది.*

మైసూరు రాష్ట్రప్రగతిని అభివృద్ధిని తెలియజేసే *శ్రీ మహీశూర రాజాభ్యుదయాదర్శః (1925)* అనే చంపూ కావ్యాన్ని 83 పద్యాల్లో, 4 గద్యాల్లో సంస్కృతంలో రూపొందించారు. మైసూరు రాష్ట్ర అభివృద్ధిని, ప్రగతిని తెలియజేసే కావ్యంలో 'సుకృతి మాత్రభోజ్యం మహీసూర రాజ్యం' వంటి పదబంధాలు అనేకం. ఆధునిక వైజ్ఞానిక సంస్కృతి విజయగాథ ఈ కావ్యంలోని వస్తువు. సుందర పాండ్య విరచితమైన *ఆర్య (1970)* అనే సుభాషిత గ్రంథాన్ని ఆంధ్రీకరించారు. చక్కని తెలుగు పలుకుబడులు ప్రయోగించి నైతిక విలువలను తెలియజేసారు. 13వ శతాబ్ది వాడయిన జాయపసేనాని రచించిన *నృత్తరత్నావళిని (1961)* పరిష్కరించి ఆంధ్రీకరించి ప్రచురించారు. ఎనిమిది అధ్యాయాలు గల ఈ రచన మార్గ, దేశి, నృత్య విశేషాలను వివరిస్తుంది. కాళిదాసు రఘువంశాన్ని, భాసుని స్వప్నవాసవదత్తాన్ని ఆంధ్రీకరించారు. కాని అవి అముద్రితాలుగానే మిగిలిపోయాయి. సంస్కృత సాహిత్యంపట్ల వారికున్న అభిరుచి తెలుగువారికి వరమయ్యింది. రాళ్ళపల్లి సంగీత సాహిత్యాలకు సంస్కృతాంధ్ర భాషలకు సమ ప్రాధాన్యం ఇచ్చారు.

---

* (కురవకంబు కౌఁగిటకు నరయుచున్నావేమి

నీకు దోహదంబు నెమకి కొనక ? గాథా సప్తశతీసారం

కాళిదాసు విరచితమైన మాళవికాగ్నిమిత్రంలో తపనీయాశోకవృక్ష దోహద క్రియకుపక్రమించిన మాళవికను చూసి అగ్నిమిత్రుడు భావించిన తీరిట్టిదే.

నిజము చూడగా నేర్చు నానెలత కనులు

తనకు సరివారి యెడగదా తగును వలపు – గాథాసప్తశతీ సారం

తగని వానిని వలచి సాధించుట కంటె తగిన వానిని వలచి నిరాశతో మరణించుట మేలు.)

వంగభాష నుండి కన్నడంలోకి అనువదింపబడిన 'లీలాదేవి' (1913) నవలను రాళ్ళపల్లి తెలుగులోకి అనువదించాడు. వీరి రచనలు కొన్ని కన్నడ భాషలోనూ అనువదింపబడ్డాయి. త్యాగయ్యగారి గానసుధారసము 'గానకలె' గాను, నాటకోపన్యాసములు 'నాటకోపన్యాస'గాను, రాయలనాటి రసికత 'సాహిత్య మత్తు జీవన కలె' గానూ కన్నడంలో అనువదింపబడింది.

శర్మగారి అనువాద సౌందర్యం బహుముఖత్వం కలది. అనువాదకుడు సంయమనం పాటిస్తే స్పష్టత, సారళ్యం చేకూరుతుంది. తన పాండిత్యానికి ఆనకట్ట వేయకపోతే అనువాదం కంటే మూలమే సులభగ్రాహ్యమౌతుంది. సరళ సుందర రచనతో ఛందస్సు ఒక సహాయకారిగా నిలుస్తుంది. ప్రాకృత, సంస్కృత, తెలుగు, కన్నడ భాషల్లో తమకు గల పాండిత్య ప్రకర్షను, సృజనాత్మకతను తెలుగువారికి చవిచూపించాడు. వీరు పాటించిన అనువాద పద్ధతులు పరిశీలనాత్మకం.

వీరి సారస్వతోపన్యాసాలలో కొన్ని వ్యాసాలు, నాటకోపన్యాసాలు, వేమనపై ఉపన్యాసాలు కన్నడభాషలో అనువదింపబడ్డాయి.

గ్రంథపరిష్కరణ

*శ్రీ మదాంధ్ర మహాభాగవతం, పాండురంగ మహాత్మ్యం, శ్రీ కృష్ణ భూపాలీయం* వంటి గ్రంథాలను పరిశీలించి పరిశోధకుడిగా పరిష్కరించి సమగ్ర పీఠికలను అందించారు. *శ్రీ మదాంధ్రమహాభాగవత* పీఠికలో రాళ్ళపల్లి శిథిల పూరణవాదాన్ని విశ్వసించారు. కూచిమంచి తిమ్మకవి (1756) పోతనపై ఏర్పడిన నిరసన దృష్టిని తొగించాలనే ప్రయత్నంలో శిథిలమైన భాగాలను ఇతర కవులు పూరించారని పోతన రచనలో లక్షణ విరుద్ధమైన ప్రయోగాలులేవని వాదించారు. (లక్షణసార సంగ్రహము, కూచిమంచి తిమ్మకవి*)

---

* పోతన రచనలో రేఫ, శకట రేఫ సాంకర్యం లేదని, పూరాణ భాగాలలో రేఫ, శకట రేఫ సాంకర్యముందని తిమ్మకవి వివరించాడు.

శ్రీమదాంధ్ర భాగవతము పీఠికలో ఒంటిమిట్ట, ఓరుగల్లు గురించి నికరంగా సిద్ధాంతీకరించవలెనని వివరించారు. రాళ్ళపల్లివారి పీఠికల్లో పాండురంగ మహాత్మ్యం విశిష్టమైనది. ఇది పరిశోధనాత్మకమైన విమర్శనాత్మకైమన పీఠిక. పీఠికా రచనకు సాహిత్యపు విలువను కూర్చినవారు రాళ్ళపల్లి. విలక్షణత, సుందరత సమీక్షాశిల్పం వీరి పీఠికల్లో వ్యక్తమౌతుంది. గ్రంథపరిష్కరణకు గ్రంథ ప్రచురణ సంస్థలనుండి, సంస్థానాలనుండి ప్రతులను సిద్ధం చేసుకొని ఏ ప్రతి తరువాత ఏది అనే క్రమాన్ని నిర్ణయించారు. పాఠభేదాలు గుర్తింపబడటం పరిశోధనకు ప్రయోజకత్వాన్ని చేకూరుస్తుంది. వట్రసున్న అరసున్నగా తరువాత హల్లు ద్విత్వం ఉంటే నిండుసున్నగా పరిగణించాలనే పఠన పద్ధతులను వివరించారు.

ఈనాడు మనం తెలుగు సాహిత్యంలో ఎన్నో గ్రంథాలను ముఖ్యంగా కావ్యాలను చదివి రసహృదయులు కావటానికి ఆ గ్రంథావిష్కరణ వెనుక జరిగిన పరిశోధన కృషి ఫలితమే.

తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, గద్వాల సంస్థానం నుండి తాళప్రతులు, మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంనుండి పాఠక భేదాలు సూచించిన ప్రతులు, పలు ముద్రణా యంత్రాలనుండి వెలువడిన ప్రతులు, అన్నింటిని పరిశీలించి పరిష్కరించి చేసిన పరిశోధన వలన కావ్యాన్ని తెలుగు వారందరూ రసహృదయంతో ఆస్వాదించగలుగుతున్నారు. ఈ ప్రబంధంలో అర్థంలేని ముద్రణ పాఠాలకు మెరుగులు దిద్దారు రాళ్ళపల్లి.

ఉదాహరణకు వనకేళి పలాశ దోహదంబు ముద్రణ పాఠం. బులుసు వేంకటరమణయ్యగారు అడవి మొక్కలకు చేసిన దోహదక్రియ అని అర్థవివరణ నిచ్చారు. అవకేశి ఫలములులేని గొడ్డు, పలాశి చెట్టు పండని చెట్టుకు ఎరువు పెట్టుట వంటిదని భావం. నిగమశర్మ భార్య యవ్వనమటువంటిదని వర్ణించే సందర్భంలో 'వనకేళి' అని గాక "అవకేశి" అని పరిష్కరించారు. పలశ అనిగాక పలాశి అని సంస్కరించి సవరించారు. ఇటువంటి పరిష్కరణలు చేయబట్టే పఠితలు రసానంద హృదయులవుతున్నారు. రామకృష్ణుని

కాల దేశాదులు రచనల క్రమాన్ని తెలియజేసారు.

రంగనాథ రామాయణం తెలుగు సాహిత్యంలో పలువురుని ఆకర్షించినది. వేటూరి ప్రభాకర శాస్త్రిగారి నిర్నామకర్మను గురించి పేర్కొన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారి పీఠిక, కట్టమంచి రామలింగారెడ్డి గారి అనుబంధ పీఠికలపై విమర్శనాత్మక వ్యాసాన్ని రచించారు. ఆకృతిక విషయచర్చతో ఏకీభవించలేక పోవటానికి కారణాలను చూపించారు. మూడు ప్రతులలో పాఠముద్రణం మూలకర్తవని, సులోచన కథను ఒకటవ అనుబంధంలో చేర్చి మూల ప్రతిలోని రచన, సులోచన కథా రచన ఒకటేనని నిర్ధారించారు. రాళ్ళపల్లి ఆ కథను రంగనాథ రామాయణ కర్త కర్తృత్వమా ? కాదా ? అన్న విషయంపై చర్చించారు. శైలినిబట్టి నిర్ణయించుట సర్వసమ్మతమైన పద్ధతి అని అది బుద్ధ కృతము కాదని రాళ్ళపల్లి అభిప్రాయం. ఇద్దరు రచయితలు చేయలేని తీర్మానాన్ని రాళ్ళపల్లివారు తేల్చివేసారు.

ఈ కాలంలో వెలసిన పీఠికల్లో కవి జీవితం, కాల దేశాదులు, గ్రంథకాల నిర్ణయం వంటి అంశాలను తెలియజేసారు. కావ్యానికి సంబంధించిన విషయాలను ప్రస్తావించటం అతి స్వల్పమని భావించవచ్చు. ఛందస్సు, భాషాప్రయోగం వంటి బాహ్యరూప పరిశీలనకు ప్రాధాన్యమిచ్చారు. కాని అంతరంగ వివేచన కొనసాగలేదు. కావ్య తత్త్వాన్ని తెలియజేసి రచనలు పరిశోధనాత్మకమైన రచనలు కావ్య పీఠికలై ప్రత్యేక అనుశీలన యోగ్యమయ్యాయి.

రాళ్ళపల్లి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించారు. 108 కీర్తనలను స్వరపరిచి ఆ రాగాల పుట్టు పూర్వోత్తరాలను చర్చించారు. అర్థానుస్వార, శకట రేఫ ప్రయోగాలను చర్చించి వ్యర్థ ప్రయోగమన్నారు. వ్యావహారికమే సుకరమని భావించారు.

శ్రీ గౌరి పెద్ది రామసుబ్బశర్మ గారి సహాయంతో తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలను పరిష్కరించారు. తిరుమలయ్య, చినతిరుమలయ్య గేయాలను పరిష్కరించారు. వాటికి పీఠికలు కూడ రచించారు. తెలుగు సాహిత్యంలో

వెలసిన అన్ని ప్రక్రియలకు రాళ్ళపల్లి పీఠికలు రాసారు. ప్రాచీన ఆధునిక కావ్యాలకు గేయాలకు పద సాహిత్య గ్రంథాలకు, వ్యాకరణ గ్రంథాలకు, నవలలకు, నాటకాలకు, వ్యాసాలకు పీఠికలు రాసారు. ఈ పీఠికలన్నీ సాహిత్య లోకానికి పరిశోధకులకు మార్గ దర్శకాలు.

సి. నారాయణ రెడ్డి నాగార్జున సాగరము, విశ్వంగారి పెన్నేటి పాట, శ్రీ దీపాల పిచ్చుయ్యశాస్త్రి ద్రోణప్రశస్తి మొదలైన వాటికి పీఠికలు రాసారు. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 8వ సంపుటం, పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రబంధ నాయికలు ఉపోద్ఘాతంలో రచయిత నిష్పక్షపాతంగా అభిప్రాయాలను తెలియజేసారు. గంగప్ప గారి క్షేత్రయ్య పద సాహిత్యం, వేటూరి ఆనందమూర్తిగారి తాళ్ళపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాలు, రామలక్ష్మి ఆరుద్రగారి తాళ్ళపాక వారి పలుకుబళ్ళు మొదలయిన గ్రంథాలకు విలువైన పీఠికలను అందించారు. పద సాహిత్యం గురించి అధికారికంగా మాట్లాడగలిగిన నేర్పు రాళ్ళపల్లి రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచించిన సారస్వతవ్యాసములు సారస్వత లోకముగా మరికొన్ని వ్యాసాలతో ముద్రితమయ్యింది. రాయలనాటి రసికత నాచనసోముని నవీన గుణములు, నిగమశర్మ అక్క, రంగనాథ రామాయణము ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథునికీయదగిన స్థానము, త్యాగయ్యగారి నాదసుధారసం, తిక్కన తీర్చిన సీతమ్మ మొదలయిన అంశాలమీద విమర్శనాత్మక పరిశోధన గావించారు. ప్రబంధాల ఆధారంగా రాయలనాటి రసికత, రాయలవైదుష్యం అనే వ్యాసాలలో ఆనాటి ప్రజల రసిక జీవనాన్ని వివరించారు. ఆధునికుల అరసికతను వేలెత్తి చూపి దానికి కారణం అలసత్వమన్నారు. ఆధునికులలో స్వాతంత్ర్యకాంక్ష లేదని పారతంత్ర్యమే సుముఖమని విమర్శించారు.

నాచన సోముని నవీనగుణములు, భావ వస్తు రచనా కళలను గురించి ప్రస్తావిస్తూ కళావ్యక్తికి భావం జవమని, వస్తువు బుద్ధియని, రచన శరీరమని సోపపత్తికంగా నిరూపించారు. భావకళకు తిక్కన కవిత్వాన్ని, వస్తుకళకు ఎఱ్ఱన కవిత్వాన్ని, రచనాకళకు

నాచనసోముని కవిత్వాన్ని విడమరచి చూపారు. సోముని రచనా కళకు అర్థ శబ్దాలంకారములు ప్రధానమని వివరించారు. భావ ప్రాధాన్యం లేని వుస్తువు, రచన సోముని రచనా కళ అని నిర్ధారించారు. రాళ్ళపల్లి పాత్ర చిత్రీకరణను తెలియజేసే వ్యాసాలు నిగమశర్మ అక్క, తిక్కన తీర్చిన సీతమ్మ.

రామకృష్ణ కవి పరిహాస దృష్టి పరిహాసము పవిత్ర వస్తువును కూడ గమనింపదేమో అని నిగమశర్మ అక్క కొత్తగా చేయించుకున్న ముక్కెర పోయెనని 'దుర్వారయై' యడలెనట... తిక్కన తీర్చిన సీతమ్మ వ్యాసంలో సీతాపరిత్యాగ ఘట్టంలో తిక్కన కల్పనలు సీతమ్మకు వ్యక్తిత్వాన్ని నిలిపింది. స్త్రీ స్వాభిమానాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాడు తిక్కన.

వేమన గురించి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ రాసిన వ్యాసాలు విమర్శనాత్మకాలని పండితుల, పరిశోధకుల అభిప్రాయం. ప్రత్యక్ష ప్రమాణాలులేని విషయాలను పరిశోధించి విషయ సేకరణ చేసి ప్రాక్కల్పనకు నిర్ధారణచేసి ఆధారాలతో కావ్యార్థాలతో నిరూపణ చేయటం పరిశోధనవుతుంది. రాళ్ళపల్లి వేమనపై ఏడు ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ ఉపన్యాసాలు 'వేమన' పేరుతో ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు వాల్తేరువారు ముద్రించారు. దీనిని పరిశోధనా గ్రంథంగా పరిగణించాలి. తర్కబద్ధంగా చర్చించి వ్రాసిన పరిశోధన. వేమన కాలం, ప్రాంతం, వేమన సంసార స్థితిగతులు, మత ధర్మాల స్థితి, యోగసిద్ధి, మత ప్రచారం మొదలైన అంశాలను పరిశీలించారు వేమన వంటివారు (సర్వజ్ఞుడు, తిరువళ్ళువర్, పరబ్రహ్మం ... మొదలైనవారు), వేమన కవిత్వం, హాస్యం, నీతుల గురించి ప్రస్తావించారు. ఇటువంటి ఆధారాలు లేకుండా కవి జీవితాన్ని కావ్యార్థ సమన్వయ దృక్పథంతో నిర్ణయించటం క్లిష్టమైన ప్రయత్నం. క్షేత్ర పర్యటన ద్వారా సేకరించిన సమాచారం పరిశోధనకు ఆలంబనమయ్యింది. వేమన కవితల్లో భావ తీక్షణత, భాషా సారళ్యం, స్పష్టత, ఆస్వాదనీయత ప్రధానం. యతి నియమాలు పాటించటంలో తిక్కన కన్న వేమన మేలని రాళ్ళపల్లివారన్నారు. వీరి కవితల్లో హాస్యం వ్యంగ్యం ప్రధానంగా కనిపిస్తుంది.

వేమనను సర్వజ్ఞ, తిరువళ్ళువర్, వీరబ్రహ్మంతో పోల్చి చూశారు. తిరువళ్ళువర్ రచించిన తిరుక్కురళ్‌ని గురించి రాళ్ళపల్లి వివరించారు. క్రీస్తు శకపు మొదటి శతకం తిరుక్కురళ్ కురళ్ అనగా ఛందస్సు. ఆటవెలదిలో సగం ఉంటుంది (రాళ్లపల్లి వేమన). ధర్మార్థ కామమనే మూడు పురుషార్థాలను గురించి చెప్పిన దేశ శాస్త్రం, ధర్మ విభాగంలో 70 అధికారాలు ఈ అధికారాలు అధ్యాయాల వంటివి. ఒక్కొక్క అధికారానికి 10 పద్యాలు అర్థ అధికారంలో 38 చొప్పున 380 కామ అధికారంలో 25 చొప్పున 250 పద్యాలు రచించాడు. ధర్మం (అరత్తుల్ 700) అర్థం (పొరుళ్ పాల్ 380) కామం (కామత్తు పాల్ లేదా ఇణ్బొత్తు పాల్) మొత్తం 1330 పద్యాలు.

కురళ్ ఛందస్సు – మొదటి పాదంలో నాలుగు పదాలు, రెండో పాదంలో మూడు పదాలు ఉంటాయి. ద్విపద రచనలా కొనసాగుతుంది.

అగర ! ముదల ! ఎళుత్తెల్లాం ! ఆది

భగవన్ ! మొదట్రే ! ఉలుగు

అకారాది వర్ణాలన్నిటికి అ వర్ణమే ఆది వర్ణం

అఖిల జగత్తుకు ఆధారం ఆది దేవుడు. ఇది తిరుక్కరళ్‌లో మొదటి పద్యం. (ఆది – అనే చండాల స్త్రీకి భగవంతుడను బ్రాహ్మణునికి జనించినవాడు. ఆది భగవన్ – తల్లి ఆది, తండ్రి భగవన్ తిరువళ్ళువర్ నేతపని వృత్తిగా కలవాడు.).

జర్మన్, ఫ్రెంచి, లాటిన్, ఇంగ్లీష్ భాషలలో అనువదింపబడింధి. ఈ కారణంగానే తిరువళ్ళువర్ ఉలగ మహాకవి (ప్రపంచకవి) అయ్యాడు. వేమన ప్రజాకవిగా పేరు పొందాడు.

తిరువళ్ళువర్ పసిపిల్లలను, ఆడపిల్లలను గృహిణిని వేశ్యను హీనంగా చూడలేదు. పసిపిల్లల మురికి చేతుల ముద్దలను అమృతమన్నాడు. వేమన ముద్దజంక బెట్టి ముద్దడనేలరా అని అసహ్యించుకున్నాడు.

“అమిళ్ దినం అట్ర ఇందే తం మక్కళ్

సిరుకై అళావియ కూళ్

తాం విళ్వార్ ! మెన్ తోళ్ ! తుయిలిన్ ! ఇణిదుకొల్

తామరై ! కణ్ణాన్ ! ఉలగు”

తామర లోచనుని లోకం కన్నా ప్రియురాలి భుజాలపై

సేద తీరటం మిన్న అని తిరుళ్ళువర్ తెలియజేసారు.

“కండు కేట్టు ! ఉండుయర్తు ! ఉట్రిరియుం

ఐంపులనుమ్ ! ఒండొడి ! కణ్ణె ఉల”

దృష్టి, శ్రవణం, రుచి, వాసన, స్పర్శలను పంచేంద్రియాల ద్వారా పొందే అనుభూతి స్త్రీలోనే ఉంది అన్నాడు తిరువళ్ళువర్. రాళ్ళపల్లి వేమనకు సర్వజ్ఞకు, వీరబ్రహ్మానికి, తిరువళ్ళవరు బోధనలకు మధ్య సాదృశ్య భేదాలను నామమాత్రంగా స్పృశించి విడిచిపెట్టారు. పరిశోధనకు యోగ్యమైన విషయాలను నిశ్చలమైన నీటిలో రాయి వేసిన రీతిగా విమర్శించారు. తిరుక్కురళ్ అనువాదం తెలుగులో కనుపర్తి వెంకటరాయ శ్రీ విద్యానందుల వారు మొదటి రెండు ధర్మార్థ కాండాలను త్రివర్గదీపిక పేరుతో ప్రకటించారని, ఆంధ్రులు దానిని గమనించలేదని రచయిత దానికి వ్యాఖ్య తాత్పర్యం రాయవలసి వచ్చినా అది నిలవలేదని వివరించారు. గరిమెళ్ళ సత్యనారాయణ గారు కూడా ప్రయత్నించారని తెలియజేసారు.

త్యాగయ్యగారి నాదసుధారసం. రాళ్ళపల్లి త్యాగరాజు భక్తిని, కవిత్వ కళ, గాన కళను గురించి విశ్లేషిస్తూ త్యాగరాజు కీర్తనలను స్పృశించారు. వేమనపట్ల ఆయనకున్న గౌరవం ఎందుకోమరి త్యాగయ్య పట్ల కనిపించదు. పరమ భాగవతోత్తముడు, వాగ్గేయకారుడు, సంగీత త్రిమూర్తులలో ఒకడు అయిన త్యాగరాజుని అపర వాల్మీకి అవతారమని, శ్రీ ఆదిశంకరుల అంశమని పెద్దలు పలికారు. యాగ యోగ ధ్యానాది

నిష్ఠలను విడిచి కేవలం నామస్మరణచేత ముక్తిని పొందట సులభమని గ్రహించి అందరికీ సద్గురువయ్యాడు.

రాళ్ళపల్లి సారస్వతాలోకంలో 'త్యాగయ్య గారి నాదసుధారసము' అనే వ్యాసంలో శ్రీ రామభక్తి, కవిత, గానం పూర్వ జన్మ పుణ్యం వలననే కాని మనుష్య ప్రయత్నంతో వచ్చేది కాదని త్యాగయ్య గారికి మూడు తరాల సంగీత సాహిత్య భగవద్భక్తులు కలిగాయని చెప్పారు. భక్తి సాహిత్యాలు, సంగీత సాహిత్యాలు, భక్తి సంగీతాలు త్యాగయ్య జీవితంలో త్రివేణి సంగమాలు, స్మార్త సంప్రదాయానికి తలొగ్గిన పరిస్థితులు త్యాగయ్యలో కనిపిస్తుంది. కృష్ణాది మూర్తులను గురించి శాస్త్రానికి రెండు మూడు కీర్తనలు రచించాడు. 'కోదండపాణి రూపముతో వెలసిన వాడేరా దైవము' అని అన్నాడు. త్యాగయ్య భక్తి మార్గం అందరాని పండు, అందినా తినలేము, తిన్నా జీర్ణించుకోలేము. త్యాగయ్య గారి రెండవ వరం కవిత్వకళ. రామభక్తి తనకు ముక్తి అనేవి భావనా విషయాలై కవితా కళకు సంకుచిత వలయం ఏర్పడిందన్నారు. అందుకే శ్రీ రామమూర్తి దేవునిలా కాక మానవుడిగా కానవచ్చాడు. దివ్యమూర్తి మనుష్యుల అంతస్తుకు దిగాడు*. త్యాగయ్య భాష సహజమైన మెరుగులు కోల్పోయిందని ఈ వ్యాకరణ నియమోల్లంఘన సహజంగా సరళ మార్గంలో నడవలేదన్నారు. త్యాగయ్యకు శక్తి, అభ్యాసం ఉన్నా లోక శాస్త్ర కావ్యాదుల పరిశీలనవలన కలిగే జాణతనం లేదన్నారు. అందుకే ఆయన రచనలో బాలభావాలు కనిపిస్తున్నాయన్నారు. కీర్తనలలో అస్పష్టత అర్థం లేని భావాలు ఉన్నాయని రచనలో అఖండత కవితలో రసం చాలదని ఖండించారు.

త్యాగయ్య గారి నాదసుధాంసాన్ని ఇంత ధైర్యంగా విమర్శించిన వారు లేరు. రాళ్ళపల్లిమీద ఎన్ని విమర్శా వ్యాసాలు వచ్చినా రచయిత లెందుకో ఈ విషయాన్ని స్పృశించలేదు. కట్టె విరగదు పాము చావదు అన్నట్టుగా తప్పించుకుని పరిశోధన చేశారు.

త్యాగయ్య రాముడిని అప్తుడిగా చెలికాడుగా భావంచాడు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని మారీచుని ద్వారా రాముడు ధర్మస్వరూపుడని, స్వచ్ఛమైన మనస్సు కలిగిన

---

* ఆత్మానం మానుషం మన్యే మా

పరిపూర్ణ మానవుడని పేర్కొన్నారు. భగవంతుడంటే ఎక్కడో కళ్ళకు కనిపించని ఎత్తున ఉంటాడని కాకుండా తన ఇంటి ముంగిలిలో ఉన్నట్లుగానే భావించాడు. మేలుకొలుపులు పాడి సకలోపచారాలు చేస్తూ తన కష్ట సుఖాలు అతనితో పంచుకుంటూ నిష్ఠూరాలాడుతూ కీర్తనలు రచించాడు. శ్రీ రాముని బంధువులను తన బంధువులుగా భావించాడు. "సీతమ్మ మాయమ్మ", సీతారాములను తల్లిదండ్రులుగా, గరుడ హనుమ, లక్ష్మణులను సోదరులుగా రామభక్తి కలిగిన సకల దేవతలను పరమ భాగవతులను పరమ బంధువులుగా చెప్పుకున్నాడు. ఏమీ తెలియని సామాన్య మానవులు పాడుకునే రీతిలో సులభమైన వాగ రాగ భావలయాదులలో కీర్తనలు కూర్చాడు.

కృతులలో అద్వైత సిద్ధాంతాన్ని వ్యాపింపజేసాడు. తన కాలం నాటి సమాజ స్థితులకనుగుణంగా సర్వదేవతల మధ్యగల విభేదాలను తొలగించడానికి అన్ని దేవతలను గురించి కీర్తనలు రచించి ఇష్టదైవాలను అన్ని రూపాలలో దర్శించవచ్చని సహేతుకంగా నిరూపించాడు.

కోవూరు సుందరేశ్వర పంచరత్నాలలో ఒకటైన శంకరాభరణ రాగంలో 'సుందరేశ్వరుని జూచి' అనే కృతిలో శివుడికి విష్ణు చిహ్నాలు ఆపాదించి అభేదాన్ని పాటించాడు. పార్వతీదేవిని రాముని సోదరిగా కీర్తించాడు. శివ, విష్ణు, శక్తి స్వరూపాలను ఏకరూపంగా భావించి ప్రజలకు భక్తిపట్ల ఒక నిర్దుష్టావగాహనను కల్పించాడు. జన్మ రాహిత్యానికి నామ సంకీర్తన, నాదోపాసనను ఎంచుకున్నాడు. నాదానికి మూలంగా శంకరుని వర్ణించాడు. నాద తనుం అనిశం శంకరం అని చిత్తరంజనిలోనూ ఇంకా పలుకీర్తనలలో నాదరూపుడిగా స్తుతించాడు. అరభీరాగంలో నాదసుధారసమే నరాకృతి ఆయెరా ప్రణవ నాద .... శ్రీరాముని నాదసుధారసమే నరాకృతి దాల్చినదని ధర్మరక్షణార్థమై చేపట్టిన కోదండం నాదంలో భాగాలైన సప్త స్వర రాగ దురనయ దేశ్యాదులు ఎడతెరపి లేకుండా వేగంగా సాగే లయగతుల సరసమైన సంగతులు రాముని కోదండానికి గంటలుగా త్రాళ్ళుగా శరాలుగా మారి నడిచివచ్చిన నాద రూపంగా వర్ణించాడు.

తాను దర్శించిన క్షేత్ర దేవతలపై మాత్రమే కాక, కావేరి నదిపై రచించిన కీర్తనలు శ్రీరాముని స్తుతించిన వేలాది కీర్తనలు త్యాగరాజు నిష్కళంక భక్తి ప్రజలలో వ్యాపించడం వల్లనే ఎందరో వాగ్గేయకారులు కవులు భక్తులు అందుకోలేని స్థానాన్ని అందుకున్నాడు. నేటికి కర్ణాటక సంగీతమంటేనే త్యాగరాజు కీర్తన అన్న దృఢమైన అభిప్రాయం ఉంది. త్యాగరాజు కీర్తన లేకపోతే కచ్చేరీ సంపూర్తి కాదు. ఒక్క త్యాగరాజు కీర్తనతోనే సరిపుచ్చుకున్నా పరిపూర్ణమైన కచేరీగా శ్రోతలను అలరిస్తుంది.

అందరికీ జన సమ్మతమైన రామ తారక మంత్ర ప్రభావాన్ని ఎంతో సులభంగా అందరి నోటా పలికేలా ఎన్నో కీర్తనలు రచించాడు త్యాగయ్య. రాముని దయను నిర్గుణతత్వాన్ని వర్ణిస్తూ ఖరహర ప్రియరాగంలో “ఉండేది రాముడొకడు .... ఊరక చెడిపోకు మనసా అని మరో కీర్తనలో ఒక మాట, ఒక బాణము, ఒక పత్నీ వ్రతుడే...” రామావతార రహస్యాన్ని చెప్పి చరణంలో చిరంజీవత్వము, నిర్జర వర సౌఖ్య మొసంగు అని రామనామ స్మరణ వలన కలిగే ప్రయోజనాన్ని ఇంత సులువుగా మరెవరైనా చెప్పగలరా....

త్యాగరాజు చిన్నప్పటి నుండి పోతనకు ఏకలవ్య శిష్యుడు. భాగవత పఠనం చేసి చేసి అందులో ప్రత్యణువును పోతన హృదయాన్ని అర్థం చేసుకున్నాడు. పోతన గజేంద్రమోక్ష ఘట్టంలో గజేంద్రుడు మకరిచేత బడి కొన ఊపిరితో కొట్టుకుంటూ లోకంబులు లోకేశులు అందరూ మాయమై పెంజీకటి కావల ఉన్న ఒక మహాజ్యోతిని రక్షించమని వేడుకున్నాడట. అలాగే త్యాగరాజు తన అంత్య కాలంలో తాను స్తుతించిన దేవతలందరినీ ఏకం చేసి ‘పరమాత్ముడు వెలిగే ముచ్చట బాగా దెలుసుకోరే’ అని పరమాత్మ నిర్గుణ తత్త్వాన్ని ఒక్క కీర్తనలో సులభంగా చెప్పాడు.

త్యాగరాజు సంస్కృతాంధ్ర పండితుడు, వాగ్గేయకారుడు భక్తియే జీవన లక్ష్య మైనవాడు. రాజాశ్రయాలకో, మెప్పులకో కీర్తనలు రచించలేదు. కావ్య గుణాలయిన ఛందోబద్ధమైన క్లిష్ట పదబంధాలు సమాసాలు ఉపయోగించలేదు. భక్తిని సామాన్య జనానికి

అందించడమే అతని కీర్తనల ధ్యేయం. తానెరిగిన భక్తి మార్గాన్ని జనావళికి తెలియపరచడమే అతని కోరిక. కనుక కావ్యాది గుణాలకు అధిక ప్రాధాన్యమివ్వలేదు. అయితే సహజంగా పండితుడు కనుక యతి, ప్రాస, అలంకారాలు కీర్తనలలో అతిసరళంగా చోటుచేసుకున్నాయి. "రెండు, మూడు నది నాథుడు" అనడంలో పంచనదీశ్వరుడు లేదనిపిస్తుంది. తమిళంలో 'అయ్యారప్పన్' అనే అర్థంలో వాడుకోవడంలో తప్పు లేదనిపిస్తుంది.

శ్రీనాథుడంతటి మహాకవులు కూడా 'దిన వెచ్చము' వంటి పదాలు అన్య భాషాపదాలు ఎన్నో వాడుకున్నారు. ఇవి జన బాహుళ్యములో అత్యంత ప్రచారం పొందాయి. కనుక కావ్యదోషంగా పరిగణించలేదు. "మనము సంప్రదాయమునకు దాసులము. దానిని మార్చుకొను శక్తి మనలో ననేకులకు లేదు. వేమన పద్యములలో అపశబ్దములు గలవు. గావున పాఠశాలలలకు తరముగాదని యందులేని పోనిండు. ఆధునికులచే వ్రాయబడి పాఠ్యపుస్తకములుగా నియమింపబడిన గ్రంథములలో అపశబ్దములు లేనివి పదికొక్కటి చూపగలరా ? అని 'వేమన కవిత్వము హాస్యము నీతులు' వ్యాసంలో రాళ్ళపల్లి అపశబ్దాలు సుశబ్దాలను నిర్ణయించుటకు ప్రయత్నించుట వెట్టియని అన్నారు.

త్యాగరాజు నివసించిన 'తిరువయ్యారు' అనే పుణ్య క్షేత్రంలో క్షేత్రాధిపతి పంచనదీశ్వరుడు. కావేరి నది ఆ స్థలంలో ఐదు పాయలుగా చీలి ఏకమవుతుంది. కీర్తనలు లయబద్ధమైనవి. కనుక లయకు సరిపోయే విధంగా 'రెండు మూడు నదినాథుడు' అని 'సారివెడలిన' అన్ని కీర్తనలలో వాడుకున్నాడు.

కీర్తనలలో సౌందర్య మాధుర్యాన్ని పెంచే విధంగా వివిధ అలంకారాలు వాడుకున్నాడు. అఠాణ రాగంలోని 'అనుపమ గుణాంబుధి' అన్న కీర్తన చరణంలో యమకాలంకారాన్ని ఎంతో అందంగా ప్రయోగించాడు. 'జనక జామాతవై, జనక జామాతవై జనక జాలము చాలును చాలును హరీ', 'కనకపట ధర నన్ను కనకపటమేల తను కనక పటనము సేతుగాని బూని' హుస్సేని రాగంలోని కీర్తనలో వరుసగా చరణాలలో చెలిమో,

కలిమో నగవో లేక బిగివో ఇనుమా మాట వినుమా – రాయాదేశ రాయా వంటి అలంకార విశేషాలు అనేకం.

వృత్యను ప్రాస త్యాగరాజు కీర్తనలలో ఎక్కువగా కనిపిస్తుంది. దేవ గాంధారిలోని శ్రీ రఘువర అన్న కీర్తనలో చరణాలలో ఒక పదం మళ్ళీ పునరుక్తమవుతుంది.

మార మార నుత నా మనివిని వినుమా రమారమణ – మరువకురా సుకుమార మా రసనమున నీ నామము మారుమారు పల్కను దయ సేయుము ఇదే రెండవ చరణంలోనూ కనిపిస్తుంది.

లాటానుప్రాస నీలాంబరి రాగంలో రచించిన ఎన్నగ మనసుకు రాని... అనే కీర్తనలో ప్రతి పాదం చివర ఒకే పదం తాత్పర్య భేదంతో లాటాను ప్రాసలో ఎంతో రమ్యంగా ఇమిడి పోయింది.

'ఎన్నగ మనసుకు రాని పన్నగ శాయి సొగసు పన్నుగ

కనుగొనని కన్ను లేలే కన్నులేలే కంటి మిన్నులేలే

1. దేహ మేలే దేహమేలే ఈ గేహమేలే

2. కరములేత కరములేలే ఈ కాపురము లేలే

3. పొగడని నాలికేలే నాలికేలే సూత్ర మాలికేలే ...

ఇలా ప్రతి కీర్తనలోను శబ్దర్థాలంకారాలు వీనులవిందు చేస్తుంటాయి.

సత్యాన్వేషణే పరిశోధనకు పరమార్థం. రాళ్ళపల్లివారి రచనలలో భావ తీక్షణత, భాషా సారళ్యం కనిపిస్తుంది గ్రహించిన వస్తువు ఏదయినాగాని చెప్పదలచుకున్న అంశాన్ని సూటిగా స్పష్టంగా నిష్పక్షపాతంగా వ్యక్తీకరిస్తారు. వీరి అభివ్యక్తిలో ఆత్మీయత కనిపిస్తుంది.

వీరి రచనలలో 'వేమన' రచన ఉదాత్తమైనది. అధిష్ఠాన పీఠం వేమనదే. రాళ్ళపల్లి రచనలలో వేమన తరువాత పేర్కొనదగిన సాహితీమూర్తి తిక్కన. వాల్మీకి సీతమ్మ కన్న తిక్కన సీతమ్మ స్వాభిమానం, ఆత్మగౌరవం, వ్యక్తిత్వం గలది. నాచన సోమన రచనా కళ

ఎర్రన రచన కన్నా భిన్నమైనది.




'వేమన' పై వ్యాసాలు పరిశోధన గ్రంథంగా రూపొందించారు. త్యాగయ్య కీర్తనలలో భక్తికన్నా, కవితాకళ కన్న నాదకళ ప్రధానంగా కనిపిస్తుందన్నారు. త్యాగయ్య భక్తిలో మమేకమై రచించాడు. అతని రచనలు లాక్షణిక ధర్మానికి లొంగకపోవచ్చు. స్వతంత్ర రచనలో స్వరధర్మంతో ఒప్పుతాయి. కవిత్వ కళ కన్నా సంగీత ధర్మం అధికం. వీటిని సాహిత్య లక్షణంచేత విశ్లేషించ కూడదు. త్యాగయ్య కీర్తనలు గాన ధర్మం చేత ఆలాపన చేయవలసిందే గాని సాహిత్య ప్రమాణ కొలబద్ధలతో కొలిచేది కాదు. తిక్కన రచనకు భావార్థ అలంకార వస్తువును బట్టి ప్రామాణీకరించవచ్చు. కళాధర్మంచేత సాహిత్య విమర్శ చేపట్టాలి.

సిద్ధాంత రూపకల్పనకు పరిష్కరణకు పరిశీలనాత్మక దృష్టి, వివేచన, అనుశీలన అవసరం. రాళ్ళపల్లివారి ప్రతి మాటకూ పని ఉంటుంది, ప్రతి వాక్యానికీ అవసరముంటుంది. ప్రతీ అభిప్రాయానికి జీవం ఉంటుంది.

తెలుగులో తొలితరం పరిశోధకులు

జాతీయ సదస్సు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

నవంబర్ 7-9-2005